ప్రజాశక్తి
సోమవారం 16 జూన్ 2025
5
పార్వతీపురం మన్యం

సమావేశాలు, ర్యాలీలకు నిర్దేశిత ప్రమాణంలో దరఖాస్తు చేసుకోవాలి : ఎస్‌పి

పార్వతీపురంరూరల్: సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ప్రదర్శనలు నిర్వహించే వారు నిర్దేశిత నియమ, నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు,నాయకులు ఎవరైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ప్రదర్శనలు నిర్వహించడానికి ముందస్తుగా సంబంధిత పోలీస్ అధికారులకు అర్జీ చేసుకొని ఖచ్చితంగా ఎస్‌డిపిఒ నుంచి అనుమతి పొందాలన్నారు. కార్యక్రమాన్ని వారం రోజుల ముందుగా సంబంధిత పోలీస్ అధికారులకు తెలియజేయాలన్నారు. అలాగే దరఖాస్తు చేసునే వ్యక్తుల మొత్తం వివరాలు ఉండాలన్నారు. దరఖాస్తు ఫారం లో ఉన్న ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా నింపి, వారం రోజుల ముందు సమర్పించాలన్నారు. అనుమతులు తీసుకోకపోయినా, నిబంధనలు ఉల్లంఘించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిఇఒ కార్యాలయంలో కోల్డ్ వార్

- సిబ్బంది X ఇన్‌ఛార్జి డిఇఒ
- రెగ్యులర్ అధికారిని నియమించని ఫలితం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోంది. కార్యాలయం సిబ్బంది, ఇంఛార్జి డిఇఒ రాజ్‌కుమార్ మధ్య యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. ఒక దశలో జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ రంగంలోకి దిగి కార్యాలయం సిబ్బందిని హెచ్చరించే వరకు పరిస్థితి వెళ్లింది. జిల్లా విద్యాశాఖాధికారిగా ఎన్‌టి నాయుడు మార్చి 31న ఉద్యోగవిరమణ చేశారు. అప్పటి నుంచి జిల్లా విద్యాశాఖలో గందరగోళం నెలకొంది. ఇంఛార్జి డిఇఒగా రాజ్ కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌ఛార్జి డిప్యూటీ డిఇఒగా ఉన్న రాజ్‌కుమార్‌ను ఇన్‌ఛార్జి డిఇఒగా నియమించడం సరికాదనే వాదనలు తెరపైకి రావడంతో కలెక్టర్ వెంటనే ఆయన జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నారు. ఆ తర్వాత డిఇఒ కార్యాలయ ఎడి రమాజ్యోతిని ఇన్‌ఛార్జి డిఇఒగా నియమించారు. డిప్యూటీ డిఇఒ హోదా కలిగిన ఎడి రమాజ్యోతిని ఇన్‌ఛార్జి డిఇఒగా నియమించడం సరైందేనన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఒకసారి డిప్యూటీ డిఇఒగా ఉన్న రాజ్ కుమార్‌ను ఇంఛార్జి డిఇఒగా నియమించి తప్పించడం, ఆ తర్వాత ఎడి రమాజ్యోతిని ఇంఛార్జి డిఇఒగా నియమించడం, ఇప్పుడు మళ్లీ రాజ్ కుమార్‌ను ఇంఛార్జి డిఇఒగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం వంటి పరిణామాలు విద్యాశాఖలో గందరగోళానికి దారి తీశాయి. రాజ్‌కుమార్ కంటే ఇద్దరు వ్యక్తులు విద్యాశాఖలో సీనియర్లుగా ఉన్నప్పటికీ ఆయన్నే ఇంఛార్జి డిప్యూటీ డిఇఒగా నియమించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు మళ్లీ ఇన్‌ఛార్జి డిఇఒగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం వెనుక అధికారపార్టీకి కీలక నేత హస్తం వున్నట్లు తెలుస్తోంది. వాస్తవంగా అయితే ఇన్‌ఛార్జి డిఇఒగా డైట్ కాలేజీలో పని చేస్తున్న సీనియర్ లెక్చరర్‌ను గాని, విద్యాశాఖలో ఎడి స్థాయి అధికారిని గాని నియమించాల్సి వుంది. గతంలో పని చేసిన ఇద్దరు డిఇఒలు డైట్ కాలేజీలో పని చేసిన సీనియర్ లెక్చరర్లే. డైట్ కాలేజీ సీనియర్ లెక్చరర్‌ను నియమించనప్పుడు సమానమైన కేడర్ ఉన్న ఎడి స్థాయి అధికారిని నియమించాల్సి వుంది. అలా చేయకుండా జిల్లా కలెక్టర్ అధికారపార్టీకి చెందిన కీలక నేత ఒత్తిడి మేరకు ఇన్‌ఛార్జి డిఇఒగా రాజ్‌కుమార్‌ను నియమించినట్లు తెలుస్తోంది. తాజా పరిణామాల నేపథ్యంలో డిఇఒ కార్యాలయంలో సిబ్బంది, ఇంఛార్జి డిఇఒ రాజ్ కుమార్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధానికి తెరలేచింది. విద్యాశాఖ కార్యాలయంలో ఆధిపత్య పోరు నడుస్తోంది. ఫలితంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయం ద్వారా ముందుకు నడవాల్సిన కార్యకలాపాలపై ప్రభావం కనిపిస్తోంది. పూర్తి అదనపు బాధ్యతలతో ఇన్‌ఛార్జి డిఇఒగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసే అధికారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కే ఉందనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇంటి గుట్టు లంకకు చేటు అన్న చందంగా షైనింగ్ స్టార్స్ అవార్డుల కింద విద్యార్థులకు పంపిణీ చేసిన చెక్కులు చెల్లుబాటు కాని అంశం తెరపైకి వచ్చింది. పదోతరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు ప్రకటించింది. దీనిలో భాగంగా ఈనెల 9న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేష్ షైనింగ్ స్టార్స్ విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు.పూర్తి అదనపు బాధ్యతలతో ఇన్‌ఛార్జి డిఇఒ సంతకాలు చెక్కులపై లేకపోవడంతో బ్యాంక్ అధికారులు ఆ చెక్కులను తిరస్కరించారు. దీంతో విద్యాశాఖ అధికారులు షైనింగ్ స్టార్స్‌కు ఇచ్చిన చెక్కులను వెనక్కి తీసుకున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చెక్కులు ఇచ్చినట్లే ఇచ్చి తిరిగి లాగేసుకోవడం వివాదాస్పద మవుతోంది. సాక్ష్యాత్తూ విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతులు మీదుగా పంపిణీ చేసిన చెక్కులే చెల్లుబాటు కాకపోవడం చర్చనీయాంశమవుతోంది. విద్యాశాఖలో మితిమీరిన రాజకీయ జోక్యం కారణంనే గందరగోళం నెలకొందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

శ్రీశ్రీకి నివాళ్లు అర్పిస్తున్న గౌరునాయుడు, ప్రజాసంఘాల నాయకులు

మానవజాతి మార్గదర్శి శ్రీశ్రీ

ప్రముఖ రచయిత, కవి గంటేడ గౌరునాయుడు
ప్రజా నాట్య మండలి ఆధ్వర్యాన శ్రీశ్రీ వర్ధంతి సభ

ప్రజాశక్తి - పార్వతీపురం

మానవజాతి విముక్తికి శ్రీశ్రీ ఒక మార్గదర్శిని, ఆయన స్ఫూర్తి నేటి తరానికి ప్రేరణగా నిలవాలని ప్రముఖ రచయిత, కవి గంటేడ గౌరునాయుడు అన్నారు. శ్రీశ్రీ 42వ వర్ధంతి సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌరునాయుడు మాట్లాడుతూ ఒక వ్యక్తి కాదు శక్తి అని పేర్కొన్నారు. శ్రీశ్రీ అనే ద్వారాన్ని లేకుండా ఈనాటికి ఎటువంటి రచనల్లేవని అన్నారు. గురజాడ అడుగుజాడలో పయనించిన విప్లవ కిరణాల్లో శ్రీశ్రీ ఒకరిని కొనియడారు. కవి పదాలను కాదు రక్తాలను చిందించాలని మానవాళికి పిలుపునిచ్చిన మహాజ్ఞాని శ్రీశ్రీ అని అన్నారు. పూర్వంలోనే వర్తమాన భవిష్యత్తును కాలాన్ని వడబోసి చరిత్రను రాసిన మహాకవి శ్రీశ్రీ నేడు అందరు హృదయాల్లో చిరకాలం నిలిచారని గుర్తు చేశారు. ఆంధ్ర సాహిత్యంలో సమకాలీన భావజాలానికి ప్రతీకగా నిలిచారని, ఆయన రచనలు సామాజిక న్యాయం, ప్రజా హక్కులు, వర్గ వివక్ష, విప్లవ భావనలపై కేంద్రీకృతమై ఉంటాయని తెలిపారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ గడిచిన వర్గ పోరాటాల చరిత్రలో శ్రీశ్రీ మార్గదర్శకాలు ఎన్నో నిలిచాయని, ఈనాటికీ శ్రీశ్రీ రచనలను, ఆయన భావాలను యువకులు ఆదర్శంగా స్వీకరిస్తున్నారని పేర్కొన్నారు. నేటి ఉన్మాదపు రాజకీయాలను ఆనాడే బురద కంపుతో శ్రీశ్రీ పోల్చారని, అదే పరిస్థితి నేడు కళ్ల ముందు ఉందని అన్నారు. పెట్టుబడుదారుల దౌర్జన్యం, కపట రాజకీయ నాటకాలు, మత ఉన్మాదపు యుద్ధాలకు కార్మిక వర్గంతోనే అంతమందించగలమని, వీటికి సోషలిజమే ప్రత్యామ్నాయమని అన్నారు.

కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు, పిల్లా లక్ష్మునాయుడు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు, రైతు సంఘం నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, బంటు దాసు, కె.రవీంద్ర, అప్పారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు టి.అఖిల్, రాజేష్, డివైఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్, ఎం.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

వృద్ధుల పట్ల బాధ్యతగా మెలగాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

వృద్ధులు సమాజంలో ఒక ముఖ్యమైన భాగమని, వారు తమ జీవిత అనుభవాల ద్వారా యువతరానికి మార్గనిర్దేశం చేసిన అనుభవం కలిగిన వ్యక్తులని వారి పట్ల బాధ్యత, మానవత్వం కలిగిన ఉండాలని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మండలంలోని ఉల్లిభద్ర ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో వద్ధుల ప్రాముఖ్యతను, అనుభవాన్ని గుర్తించి వారిని గౌరవించాలన్నారు. వృద్ధులు మనకు మార్గదర్శకులని, వారిని సంరక్షించడం మన బాధ్యతని తెలిపారు. దశాబ్దాల అనుభవంతో వారు మనకు ఎంతో నేర్పించారని, వారు మన నుంచి అభిమానం, ప్రేమను మాత్రమే కోరుకుంటారని, వృద్ధులు సమాజానికి ఎంతో విలువైన ఆస్తిని అన్నారు. వారికి అవసరమైన వైద్య సదుపాయాలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌమ్య జోస్ఫిన్, లోక్‌అదాలత్ సభ్యులు టి.జోగారావు, ప్రభుత్వ లాయర్ బి.సత్యనారాయణ, ఉల్లిభద్ర సర్పంచ్ ఎస్.దివ్యలక్ష్మి, ఎస్ఐ రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏడో రోజుకు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారానికి ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ వివిధ రంగాల కార్మికులకు జీతాలు పెరుగుతున్నప్పటికీ అనేక ఏళ్లుగా మున్సిపాల్టీలో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వాటర్ వర్క్స్, ఎలక్ట్రీషియన్స్ వంటి నైపుణ్యం కలిగిన కార్మికులకు జీతాలు పెంచక పోవడం దుర్మార్గమని విమర్శించారు. 15 ఏళ్ల సర్వీసు పూర్తిచేసిన కార్మికులందర్నీ రెగ్యులర్ చేయాలని, ప్రమాదవశాత్తూ మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, రెగ్యులర్ చేసేంత వరకూ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక నాయకులతో చర్చలు జరిపి సమస్యలను సానుకూలంగా పరిష్కరించకపోతే పట్టణ ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు చేరని పరిస్థితి ఉంది. కావున తక్షణమే చర్యలు చేపట్టి కార్మికులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వినయ్ కుమార్, బాబురావు, గణపతి, చిన్నికృష్ణ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

సమ్మె శిబిరంలో పాల్గొన్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

జిల్లాకు గుర్తింపు తీసుకురావాలి : డిఆర్‌ఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లాకు గుర్తింపు తీసుకోవాలని డిఆర్‌ఒ కె.హేమలత ఆకాంక్షించారు. యోగాంధ్ర రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా విజేతలకు ఏర్పాటు చేసిన బస్సు ఆదివారం కలెక్టరేట్ నుంచి బయల్దేరింది. ఈ మేరకు కార్యక్రమానికి నియమించిన అధికారులు, సిబ్బందికి అక్కడ పలు సూచనలు చేశారు. జిల్లా విజేతలు, కేర్ టేకర్లు, సిబ్బందికి మౌలిక సదుపాయాల ఏర్పాట్లుపై అడిగి తెలుసుకున్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్, వైద్య సిబ్బందిని బస్సులో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన యోగాంధ్ర పోటీల్లో విజేతలను 16,17 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఎన్టీఆర్ జిల్లాకు పంపిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని తిరిగి గమ్యస్థానానికి చేరుకొనే వరకు వీరికి తగు నిర్దేశం చేస్తూ,అన్ని రకాలుగా సహకారం అందించేందుకు కార్యక్రమానికి నోడల్ అధికారిగా డిడి ట్రైబల్ వెల్ఫేర్ ఆర్.కృష్ణవేణి, లైజన్ ఆఫీసర్‌గా డాక్టర్ రఘు, యోగా మాస్టర్ మోహన్ గంటాయత్, రెవెన్యూ, వైద్య, పోలీస్, స్కూల్ పిడి సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరుతూ ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. యోగాంధ్ర జిల్లా కన్వీనర్ డాక్టర్ టి.జగన్మోహనరావు మాట్లాడుతూ జిల్లా నుండి 32 మంది విజేతలు రాష్ట్రస్థాయిలో పాల్గొంటున్నారని, సోలో, గ్రూప్ యోగా ఆసనాలు, సాంగ్, క్విజ్, పెయింటింగ్, స్కిట్, ఎస్సే, పోస్టర్, షార్ట్ ఫిల్మ్ ఇలా 11 కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందినవారున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ సిహెచ్. రాధాకృష్ణ, డిటి పి.లక్ష్మీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్సును ప్రారంభిస్తున్న డిఆర్‌ఒ హేమలత

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలోని 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథ రావు కోరారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో డి.ఆనందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి నాయకులు బి.వెంకటరమణ, 104 ఉద్యోగుల సంఘం కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో 104 సర్వీస్‌లను గతంలో అరబిందో యాజమాన్యం నిర్వహించిందన్నారు. ఈ సంస్థ రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులకు రావాల్సిన బకాయి వేతనాలు, ఇతర బకాయిలు ఇంటెల్, గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 104 సర్వీస్‌లు నిర్వహిస్తున్న భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం కూడా ఉద్యోగులకు ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని కోరారు. జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో సీనియారిటీ ప్రకారం బదిలీలు చేసి మిగతా స్థానాల్లో కొత్త నియామకాలు జరపాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్ల నుంచి మరమ్మతులకు నోచుకోని వాహనాలను వెంటనే బాగు చేయించాలన్నారు. ప్రస్తుత యాజమాన్యం భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా ప్రతి నెలా అన్ని జిల్లాల్లోనూ గ్రీవెన్స్ మీటింగ్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. అదే విధంగా 104 వాహనాల్లో క్షయ పరీక్షలకు సంబంధించిన నమూనాలు రవాణా మంచిది కాదని, వాహనాల్లో గర్భిణులకు పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. చాలా చోట్ల ఆరోగ్య కేంద్రాలు లేని చోట సిబ్బంది కూడా వాహనాల్లో సేవలు కొనసాగిస్తున్నారని చెప్పారు. ఇది చాలా ప్రమాదకరమన్నారు. ప్రభుత్వం పునరాలోచించి దీన్ని నియంత్రించాల్సిన అవసరం వుందన్నారు. ఈ విషయాలపై రాష్ట్ర ప్రభుత్వం, గత, ప్రస్తుత యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో ఎపి 104 ఎంఎంయు ఎంప్లాయిస్ యూనియన్ కోశాధికారి జగదీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.స్వామినాయుడు, ఉపాధ్యక్షులు కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాదైనా ఖరీఫ్‌కు సాగునీరందేనా!

- కాలువలున్నా ప్రయోజనం శూన్యం
- మోటార్ల సాయంతో పంటల సాగు
- వరుణుడిపైనే అన్నదాత ఆశలు
- ఇదీ కాలువ శివారు ప్రాంతాల రైతుల దుస్థితి

ప్రజాశక్తి -వీరఘట్టం

రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నామన్న పాలకులు వారికి ఎరువులు, విత్తనాలతో పాటు సాగునీరందించడంలోనూ పూర్తిగా విఫలమయ్యారు. పాలకులు మారిన తమకు సాగునీటి కష్టాలు తప్పడంలేదని ఆ ప్రాంత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది 16,500మంది సన్న, చిన్న కారు రైతులు ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నా వీరికి ఎవరికీ సాగునీరందని పరిస్థితి. తోటపల్లి రిజర్వాయర్ మొదటి కాలువ నుంచి కడకల్ల, నడిమికెల్ల, విక్రంపురం, చిట్టిపూడివలస, కిమ్మి, కొట్టుగుమ్మడ గ్రామాల మీదుగా శివారు ప్రాంతమైన గడగమ్మ గ్రామానికి సాగునీరు రావాల్సి ఉంది. అయితే ప్రతి ఏటా ఉపాధి హామీ చట్టం ద్వారా పంట కాలువల్లో చెత్తా, చెదారాలు తొలగించినప్పటికీ శివారు ప్రాంతమైన గడగమ్మకు సాగు నీరు రావడంలేదని ఈ ప్రాంత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ ద్వారా కాలువలు అభివృద్ధి చేసినప్పటికీ ఫలితం శూన్యమని రైతులు వాపోతున్నారు.

బోరు బావుల పై ఆధారం

శివారు ప్రాంతమైన గడగమ్మకు సాగునీరు రాకపోవడంతో చేసేదేమీ లేక రైతులు బోరు బావులను ఏర్పాటు చేసుకొని వాటి ద్వారా గత 2 దశాబ్దాల నుంచి పంటలు సాగు చేసుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. అవకాశం లేనివారు వరుణిడిపైనే ఆశలు పెట్టుకుని పంటలు సాగు చేస్తున్నామని చెబుతున్నారు. ప్రతి ఏటా పంటపై పెట్టిన పెట్టుబడులు కూడా రాక అప్పుల పాలై ఆర్థికంగా కృంగిపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఊరు పక్కనే సాగునీటి కాలువ ఉందన్న పేరు తప్ప చుక్క నీరు రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొట్ట దశలో కిమ్మి, కొట్టుగుమ్మడ, గడగమ్మ గ్రామాలకు చెందిన రైతులు కొంత మొత్తాలను పోగు చేసి కడకల్ల నుంచి తమ గ్రామానికి వచ్చే కాలువల్లో పిచ్చి మొక్కలు తొలగించినప్పటికీ పంటపొలాలకు సాగునీరందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హుస్సేన్‌పురం సమీపంలో ప్రధాన కాలువలోనే సెవెంత్ బ్రాంచ్ నుంచి తూడి, పివిఆర్ పురం గ్రామాలకు సాగునీరు రావాల్సి ఉన్నప్పటికీ పివిఆర్ పురం కూడా శివారు గ్రామం కావడంతో సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పూర్తికాని ప్రధాన కాలువ పనులు

తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ఆధునీకరణ పనులు చేస్తే శివారు ప్రాంతాల్లోని ప్రతి ఎకరాకు సాగునీరందుతుందన్న ఉద్దేశంతో 2018లో అప్పటి ఇంధన శాఖ మంత్రి కిమిడి కళా వెంకటరావు రూ.193 కోట్లతో వీరఘట్టం సమీపంలో నాగావళి ఎడమ కాలువ 5వ బ్రాంచ్ వద్ద శంకుస్థాపన చేశారు. సుమారు 38 కిలోమీటర్ల పరిధిలో కాలువ ఆధునీకరణ పనులు చేపట్టాల్సిన ఉన్నప్పటికీ ఇంతవరకు 17 కిలోమీటర్ల దూరంలోనే లైనింగ్ పనులు చేపట్టారు. ఇంతవరకు రూ.43 కోట్లు బిల్లులు చెల్లించినట్లు ఇరిగేషన్ అధికారులు లెక్కలు చెబుతున్నారు. ఈ ఏడేళ్లలో 23శాతం పనులే జరిగాయి. ప్రభుత్వాలు మారినప్పటికీ కాలువ ఆధునీకరణ పనులు పూర్తికాక ఈ ప్రాంత రైతులు సాగునీటి కోసం ఆశలు వదులుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తోటపల్లి ఆధునీకరణ పనులు పూర్తికి తగు చర్యలు తీసుకుని సాగునీరందించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

తోటపల్లి ప్రధాన కాలువ

మోటారు సాయంతో పంటల సాగు

గడగమ్మ కాలువ శివారు ప్రాంతం కావడంతో తోటపల్లి మొదటి కాలువ ద్వారా సాగునీరందడం లేదు. దీంతో పంట నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సొంతంగా మోటర్ ఏర్పాటు చేసుకొని ప్రస్తుతం పంటలు సాగు చేస్తున్నాను.

మజ్జి కృష్ణంరాజు, రైతు, గడగమ్మ

పిచ్చి మొక్కలతో నిండిన తూడి పిల్ల కాలువ

ఆఖరి సమయంలో గ్రామానికి సాగునీరు

ఏడో బ్రాంచ్ నుంచి తూడి గ్రామం మీదుగా పివిఆర్ పురం గ్రామానికి సాగునీరు రావాల్సి ఉంది. అయితే తూడి గ్రామ రైతుల దమ్ములు అయిపోయిన అనంతరం ఆఖరి సమయంలో పివిఆర్ పురానికి సాగునీరు విడుదల చేస్తున్నారు. అయితే ఆఖరి దశలో సాగునీరు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

- గేదెల సత్యంనాయుడు, రైతు, పివిఆర్‌పురం

ప్రభుత్వం ఆమోదం వచ్చిన వెంటనే ఆధునీకరణ పనులు

కాలువ ఆధునీకరణ పనులకు సంబంధించిన ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. ప్రభుత్వ ఆమోదం తెలిపిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- డి. వెంకటరమణ, ఇరిగేషన్ ఎఇఇ, వీరఘట్టం

బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

పేదలకు అండ సిఎం సహాయనిధి : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.3,62,917 విలువైన ఆరు చెక్కులను రాష్ట్ర స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం సాలూరులో మంత్రి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిఎం ఆర్‌ఎఫ్ ద్వారా ప్రజలకు సకాలంలో ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాలా కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మంత్రి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపారు. అనారోగ్య సమస్యల సమయంలో అందిన ఈ ఆర్థిక సహాయం తమ కుటుంబానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.

సునీతను సత్కరిస్తున్న డివిజి శంకరరావు

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

గిరిజన ప్రాంతాల్లో స్థానిక వనరుల్ని పూర్తిగా వినియోగించుకునేలా పరిశ్రమల స్థాపన జరగాలని, ఇందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరించాలని, ముఖ్యంగా మహిళా పారిశ్రామికవేత్తలను మరింత ప్రోత్సహించాలని ఎపి ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. సాలూరులోని లేఖ్య ఎంటర్‌ప్రైజెస్ పసుపు ప్రాసెసింగ్ యూనిట్ అధినేత అల్లాడి సునీతకు ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్తగా ఫాఫ్సీ అవార్డ్ వచ్చిన సందర్భంగా ఆదివారం ఆయన ఆమెను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పసుపు ప్రాసెసింగ్ యూనిట్ స్థాపించి, ఒడిదుడుకులు ఎదుర్కొని విజయవంతంగా పరిశ్రమ నడుపుతున్న సునీతను అభినందించి, ఆ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యల్ని ఆరా తీశారు. ఈ యూనిట్ సిబ్బంది, కార్మికుల్లో సగం మంది గిరిజన మహిళలు ఉన్నట్లు తెలుసుకుని హర్షం వ్యక్తం చేశారు. ఆమె విజయం చాలా మందికి స్ఫూర్తి కలిగిస్తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి ప్రతి మహిళా చైతన్యం వంతం కావాలని, అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని కోరారు.

రోడ్డు మరమ్మతు పనులు చేయిస్తున్న ఆర్‌అండ్‌బి అధికారులు

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో రహదారి విస్తరణ పనుల్లో అధికారులు నాణ్యత డొల్లతనం ప్రదర్శించడం వల్ల శనివారం సాయంత్రం పడిన భారీ వర్షానికి త్రినాధ స్వామి ఆలయంలోకి, ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. 'రహదారి విస్తరణలో డొల్ల'... ఆలయంలోకి వర్షం అన్న వార్త 'ప్రజాశక్తి'లో ఆదివారం ప్రచురితమైంది. ఈ వార్తకు ఆర్‌అండ్‌బి అధికారులు, స్థానిక నాయకులు కోలా రంజిత్ కుమార్ స్పందించారు. ఈ మేరకు ఆదివారం కాలువలో చెత్త తీసి పలకలు వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి అధికారులు మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో పూర్తిగా నిర్మాణాలు చేపట్టి ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిర్మాణ పనులు చేపడతామని ఆర్ అండ్ బి అధికారులు తెలిపారు.

ఉరుములు, మెరుపులతో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కురిసిన వర్షాలకు, ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. లక్ష్మీపురం నుంచి కామన్నదొరవలసకు వెళ్లే రహదారి మధ్యలో చప్ప అప్పలనాయుడు, కర్రిసత్యం పొలంలోకి వెళ్తున్న విద్యుత్ మోటార్ లైన్‌కు సంబంధించి ఈదురు గాలులకు విద్యుత్ స్తంభం నేలకొరిగింది. దీంతో పాటు చెట్లు కూడా పడ్డాయి. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాలను వెంటనే తొలగించి విద్యుత్తు లైనును పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

తప్పిన పెను ప్రమాదం

వీరఘట్టం : మండలంలోని చలివేంద్రిలో జననివాసాల మధ్య ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఆదివారం పేలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడం వల్ల పెద్ద పెను ప్రమాదం తప్పింది. ప్రధాన రహదారి పక్కన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడంతో ప్రధాన రహదారి గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నారు. అంతేకాకుండా గృహాలకు సమీపంలో ఉన్నందున మరింత భయందోళనకు గురి చేస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి 300 మీటర్ల దూరంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి తప్ప జనావాసాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్షణమే మార్చాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

సచివాలయ సిబ్బందిపై ఎంపిడిఒ ఆగ్రహం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని 20 సచివాలయాల్లోని సిబ్బంది యోగాంధ్ర కార్యక్రమానికి సహకరించకపోవడంపై ఎంపిడిఒ జి.రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమం లక్ష్యాలను చేరుకొనేందుకు సచివాలయ సిబ్బంది సహకరించడం లేదని, సెలవు రోజు కూడా తామే చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామస్థాయిలో తమకు కొన్ని లక్ష్యాలను విధించారని, వాటిని నెరవేర్చడం బాధ్యతగా ప్రతి సచివాలయ ఉద్యోగి చేయాల్సి ఉండగా, ఏ ఒక్కరూ ఈ విషయంపై సీరియస్‌గా లేకుండా పని చేస్తున్నారని, ఫోన్ చేస్తే కనీసం బదులు ఇవ్వడానికి కూడా వారు సహకరించడం లేదని వీరిపై పై అధికారులకు నివేదిక అందజేస్తానని తెలిపారు.

ఫ్లెక్సీ చించివేతపై చర్యలు తీసుకోవాలి

సాలూరు: పట్టణం వైసిపి నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల చించివేతపై ఫిర్యాదు చేసినా పోలీసులు ఇంతవరకు కేసు నమోదు చేయలేదని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర చెప్పారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించి వేశారని చెప్పారు.గతంలో ఇలాంటి ఫిర్యాదు చేస్తే వెంటనే కేసు నమోదు చేసి నిందితులెవరో తేల్చాలని, పోలీసులు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు.గతంలో ఎన్నడూ తాను ఫ్లెక్సీల చించివేత సంస్కృతి ని ప్రోత్సహించలేదన్నారు.ఇటీవల తన పుట్టినరోజు సందర్భంగా, వైసిపి నిర్వహించిన వెన్నుపోటు దినం సందర్భంగా అనూహ్య రీతిలో ప్రజలు హాజరు కావడాన్ని జీర్ణించుకోలేని వారు ఈ ఫ్లెక్సీ చించివేతకు పాల్పడి ఉంటారని భావిస్తున్నామని రాజన్నదొర చెప్పారు.

లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకూ పోరాడుదాం

ప్రజాశక్తి - పాలకొండ

కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లు రద్దయ్యేంత వరకూ పోరాడుతామని, జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్తంగా జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి అన్నారు. పట్టణంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమావేశం జెస్సి బాయ్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. స్కీమ్ వర్కర్ల అందరికీ కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలి డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులను బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం వారిచ్చే కమీషన్ల కక్కుర్తి పడి రద్దు చేసి కార్మికులను కట్టు బానిసలుగా మార్చడం కోసం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడాన్ని ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఒక వైపు కార్పొరేట్లకు రుణాలు మాఫీ చేస్తూ, కొత్తరుణాలు ఇస్తూనే మరోవైపు పేదలపై, చిన్న, మధ్య తరహా పరిశ్రమల యాజమాన్యాలపై విద్యుత్ యూజర్ ఛార్జీలు, జిఎస్‌టి పన్నులు వేయడంతో వేలాది పరిశ్రమలు మూత పడ్డాయని, ఫలితంగా కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కును నష్టాల పేరుతో ప్రైవేటీపరం చేసే ప్రయత్నం మానుకోవాలన్నారు. రైతుల పంటలకు గిట్టు బాటు ధర ఇవ్వకుండా, కార్పొరేట్ వ్యవసాయం పేరుతో నల్లచట్టాలు తెచ్చి భూమిని లాక్కునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మన రాష్ట్రంలో ఎమ్మెల్యే తమ వేతనాలు పెంచుకుని, కార్మికులకు జీతం పెంచకుండా పనిగంటలు పెంచి, ఉద్యమాల వైపు రానీయకుండా, సంఘం పెట్టుకునే హక్కు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. కార్మిక హక్కుల కోసం జులై 9న జరిగే సమ్మెను పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్.హిమాప్రభ, బి.అమరవేణి, ఎస్.గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

అన్ని వర్గాల కార్మికులకు రక్షణ కల్పించాలి : సిఐటియు

కొమరాడ : అన్ని వర్గాల కార్మికులకు అన్ని విధాలా రక్షణ కల్పించేలా జూలై 9న జరిగే సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర కార్మికులకు పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో జూలై

సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఇందిర

సదస్సులో మాట్లాడుతున్న ఉమామహేశ్వరి

9న జరిగే దేశ వ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ కొమరాడలో సిఐటియు సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఇందిర మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు ఆపాలని, ప్రభుత్వ రంగసంస్థలైన ఎల్‌ఐసి, బిఎస్‌ఎన్‌ఎల్ , రైల్వే, ఎయిర్పోర్టు , విశాఖ స్టీల్ ప్లాంట్ బ్యాంకుల ప్రైవేటీకరణ ఆపాలని కోరారు. కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, 8గంటల పనిగంటలు ఉండాలని, ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించి, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.అ లాగే పని గంటలు కూడా 8 గంటల బదులుగా 12 గంటలు పెంచడం సరికాదని కోరుతూ జూలై 9న దేశవ్యాప్త సమ్మె సందర్భంగా కొమరాడలో సమ్మె జరుగుతున్న నేపథ్యంలో అన్ని రంగాల కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సెక్టార్ లీడర్ లలిత, మాదలింగి సెక్టార్ నాయకులు పద్మ, ఆశా వర్కర్ల మండల నాయకులు రాజేశ్వరి, మధ్యాహ్న భోజన నాయకులు లక్ష్మమ్మ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల మండల నాయకులు దుర్గమ్మ, అంగన్వాడీ టీచర్స్ హెల్పర్లు, కమ్యూనిటీ హెల్త్, ఆశా వర్కర్లు, మిడ్ డే మీల్స్ కార్మికులు పాల్గొన్నారు.

తాగునీరు లేక పట్టణ ప్రజలు అవస్థలు

- ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ పరిధిలో ప్రజలకు తాగునీరందక ప్రజలు తీవ్ర అవస్థలుపడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని వారం రోజులుగా సమ్మె చేస్తున్నారు. వీరితో పాటు విద్యుత్ దీపాల నిర్వహణ, బోర్ల మరమ్మతు, నాగావళి నదీ పరీవాహక ప్రాంతంలోని పంప్ హౌస్, రాళ్లగెడ్డ వద్ద ఉన్న బూస్టర్ పంప్ నిర్వహణ సిబ్బందితో పాటు పలు నాన్ పిహెచ్‌సి వర్కర్లు కూడా సమ్మెలో ఉన్నారు. వారం రోజులుగా తాగునీటి సరఫరా జరగకపోవడంతో పట్టణ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు పలు వార్డుల్లోని మున్సిపల్ బోర్లు మరమ్మతులకు గురై పనిచేయడంలేదు. దీంతో వాడుక నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టకపోవడంతో ప్రజలు మరింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పలు వార్డులలో ఉన్న మహిళలు శనివారం నిరసన వ్యక్తం చేసిన పరిస్థితి వచ్చింది. పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా సమస్యకు పరిష్కార దిశగా చర్యలు చేపట్టకుండా మున్సిపల్ కార్యాలయంలోని పలువురు అధికారులు సెలవులపై వెళ్లిపోవడం గమనార్హం. మున్సిపల్ పాలన గాడిలో పెట్టి సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేయకుండా మున్సిపల్ చైర్‌పర్సన్, పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు, కూటమి ప్రజా ప్రతినిధులు, ప్రతిపక్ష వైసిపి నాయకులు గాని పట్టించుకోకుండా ఒకరిపై మరొకరు వ్యక్తి గత దూషణలకు దిగుతున్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేయడం బట్టి చూస్తే ప్రజలపై వారి ఎంత విశ్వాసందో అర్థమవుతుంది. వీటన్నింటిని పట్టణ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారనే విషయాన్ని నాయకులు గమనించాల్సిన

తాగునీటి కోసం ఎదురు చూస్తున్న పట్టణ మహిళలు

అవసరం ఎంతైనా ఉంది. మరికొన్ని నెలల్లోనే స్థానిక ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నందున సమస్యలు పరిష్కరించని వారికి తమ ఓటుతోనే సమాధానం చెప్పే అవకాశం ఉంది. ఈ విషయాన్ని అన్ని రాజకీయ పార్టీ నాయకులు గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా పట్టణ ప్రజలకు ఏర్పడిన తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు ఇతర సమస్యలు పరిష్కారం దిశగా కృషి చేయాలని కోరుతున్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజన్నదొర, వైసిపి నాయకులు

మోసానికి చిరునామా టిడిపి పాలన

పుస్తకావిష్కరణలో మాజీ డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి ఎప్పుడొచ్చినా ప్రజలు మోసపోతున్నారని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. ఆదివారం తననివాసంలో టిడిపి ఏడాది పాలనపై వైసిపి అధిష్టానం ముద్రించిన జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం అన్న పుస్తకాన్ని ఆయన నియోజకవర్గ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు గాని, 2024 తర్వాత అధికారంలోకి వచ్చిన సమయంలో గానీ మోసపూరిత వాగ్దానాలతోనే టిడిపి అధికారంలోకి వచ్చిందని చెప్పారు. గత ఎన్నికల ముందు టిడిపి ప్రచారంలో 150 హామీ లిచ్చిందని, వాటిలో పదోవంతు కూడా ఇప్పుడు అమలు చేసే పరిస్థితి లేదని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి పథకాలను అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం తో ప్రజలు మోసపోయామని బాధపడుతున్నారని రాజన్నదొర చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, గొర్లి మధుసూదనరావు, పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, ప్రచార విభాగం జిల్లా కన్వీనర్ గిరిరఘు, ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్ మోహన్ రావు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యా శాఖలో వింత పోకడలు : కాంగ్రెస్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా విద్య వింత పోకడలకు నెలవైందని పార్వతీపురం, సాలూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జులు బత్తిన మోహన్ రావు, గేదెల రామకష్ణ, నాయకులు వి.దాలినాయుడు, సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, తీళ్ళ గౌరీ శంకరరావు అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖలో పరిపాలన పక్కదారి పడుతోందన్నారు. ఉన్నతాధికారులు తమ ఇష్టారాజ్యంగా ఉత్తర్వులు జారీ చేస్తున్నారని ఆరోపించారు. పది, ఇంటర్ ఫలితాలలో రాష్ట్రంలో ప్రథమ స్థానాన్ని సాధించిన పార్వతీపురం మన్యం జిల్లాకు రెగ్యులర్ విద్యాశాఖ అధికారి లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కూడా జిల్లాను చిన్న చూపు చూస్తోందని ఆరోపించారు. కెజిబివి నియామకాలపై అవినీతి ఆరోపణలు వచ్చాయన్నారు. అనంతరం సీనియర్లను, అర్హులైన వారిని పక్కనపెట్టి ఒక ఎంఇఒను ఇన్చార్జి డిఇఒగా నియమించడం సరికాదన్నారు. అంతేకాకుండా ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన షైనింగ్ స్టార్స్‌కు ఇచ్చే చెక్కులు చెల్లుబాటు కాకపోవటం అత్యంత అవమానకరమన్నారు. చేసిన తప్పులు సరిదిద్దుకునేందుకు చెక్కులు మళ్లీ తీసుకోవడం, ఇన్చార్జి డిఇఒకు ఎఫ్ఎసి ఇవ్వడం ఇవన్నీ చూస్తుంటే జిల్లా విద్యాశాఖ పరిపాలన ఎటువైపు వెళుతుందోని ప్రశ్నించారు. అలాగే ఉపాధ్యాయుల బదిలీల్లోనూ అవకతవకలు చోటు చేసుకున్నాయన్నారు. జిల్లా విద్యాశాఖలో ఇంత జరుగుతున్నా కలెక్టర్ తగు చర్యలు తీసుకోకపోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. కాబట్టి తక్షణమే ప్రభుత్వం జిల్లా విద్యాశాఖపై దృష్టి సారించి, ఈ శాఖలో జరుగుతున్న అవకతవకలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కండాపు శ్రీనివాసరావు పిడుగు పడి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదివారం ఆ గ్రామానికి చేరుకొని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే వెంట టిడిపి సీనియర్ నాయకులు పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, ఉదయాన ఉదయ భాస్కర్ ,జామి లక్ష్మీనారాయణ, బళ్లా హరిబాబు, కె.హరి తదితరులు ఉన్నారు.

నగదు బదిలీ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి : సిపిఎం

సీతానగరం : ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యానికి బదులు నగదు బదిలీ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, మండల కమిటీ సభ్యులు జి.వెంకటరమణ ఒక ప్రకటనలో ఆదివారం డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎండియు వాహనాల రద్దుతో ప్రజలు, గిరిజనులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వీటిని రద్దు చేయడంతో చాలామంది సమస్యల్లో ఎదుర్కొంటున్నారన్నారు. కొత్తగా రేషన్ బియ్యానికి బదులు నగదు బదిలీ పథకం పెట్టి మొత్తం రేషన్ ఎత్తేవేసే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఈ తప్పుడు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకుంటే ప్రజా ఉద్యమాలతో ఆందోళన బాట పడతామని హెచ్చరించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఎర్రచెరువు ప్రధాన రహదారి వద్ద ఆదివారం ఎస్సై పి. నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుము వేశారు. ఇంతవరకు అపరాధ రుసుం కట్టని వాహనదారులకు రుసుం కట్టించారు. ఈ సందర్భంగా వాహనదారులు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండి రోడ్డు భద్రత నియమాలు పాటించి మద్యం సేవించకుండా ముఖ్యంగా ద్విచక్ర వాహనం నడిపేవారు. హెల్మెట్ ధరించి వాహనాల నడపాలని వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం నియోజకవర్గ టిడిపి పరిశీలకులుగా గండి

ప్రజాశక్తి - పాలకొండ

కురుపాం నియోజకవర్గ టిడిపి పరిశీలకులుగా గండిరామి నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, ప్రధానకార్యదర్శి లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రామినాయుడు మండల టిడిపి అధ్యక్షులతో పాటు తూర్పు కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గానూ ఉన్నారు. తనను గుర్తించి పదవి ఇచ్చిన పార్టీ అధిష్టానానికి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడుకు స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

గెడ్డలో పూడికలు తీయించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని డోకిశిల పంచాయితీలోని చెరుకుమడి గెడ్డలో ఉపాధి హామీ పనులు కేటాయించి తుప్పలు, డొంకలు తొలగించాలని సిపిఎం మండల నాయకులు పి.రాము డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తేలునాయుడువలసకు చెందిన పలు వ్యవసాయ భూములకు ఆధారమైన ఈ గెడ్డలో పూడికలు ఏర్పడడం వల్ల వ్యవసాయ భూములకు నీరు చేరడానికి వర్షాకాలం ఇబ్బందులు ఏర్పడతాయని, ఉపాధి హామీ పనులను గెడ్డలో చేయించి పూడికలు తొలగించాలని కోరారు. కేవలం ఫారం ఫాండ్ పనులకే ప్రాధాన్యత ఇస్తున్నారని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి పనులను కేటాయించి గెడ్డబట్టిని బాగు చేయాలని కోరారు.

సామరెల్లి డిఆర్ డిపో

ఆరు నెలలుగా అందని కందిపప్పు

ఎదురుచూస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి - సీతంపేట

ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిరుపేదలకు సబ్సిడీపై బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు ఇచ్చేది. గత ప్రభుత్వం కందిపప్పు, పంచదార, ప్రతినెలా నిరుపేదలకు సబ్సిడీపై అందజేసేవారు. పస్తుతం ప్రభుత్వం పేదలకు ఆరు నెలలుగా కందిపప్పు సరఫరా చేయకపోవడంతో బయట మార్కెట్‌లో కొనుక్కోలేక తినలేక ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా పౌష్టికాహారం లోపం వల్ల సికిల్‌సెల్ ఎనిమియాతో ఎక్కువమంది వ్యాధిగ్రస్తులు బాధపడుతున్నారు. అలాంటివే అధిగమించాలంటే ప్రభుత్వం కనీసం ఏజెన్సీ ప్రాంతనికైనా సబ్సిడీపై కందిపప్పు సరఫరా చేయాల్సి ఉంది. సీతంపేట మండలంలో జిసిసి ద్వారా 23 డిఆర్ డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 16,736మంది రేషన్ కార్డు లబ్ధిరులు ఉన్నారు. అలాగే సీతంపేట, భామిని మండలాలకు 30 టన్నుల కందిపప్పు అవసరం ఉంటుంది. గత ఏడాది డిసెంబర్, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే, జూన్‌లో కందిపప్పు ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. బయట మార్కెట్లో కిలో కందిపప్పు రూ.150 ధర పలకడంతో నిరుపేదలు కొనుక్కోలేని పరిస్థితుల్లో ఉన్నారు. ప్రభుత్వమే సబ్సిడీ కందిపప్పు ఇవ్వాలని గిరిజనులు కోరుతున్నారు. దీనిపై సివిల్ సప్లై డిటి మధుసూదనరావు వద్ద ప్రస్తావించగా, ఐదు, ఆరు నెలలుగా కందిపప్పు రాలేదని వస్తే సరఫరా చేస్తామని సమాధానం ఇచ్చారు.

శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

జాతీయ స్థాయిలో పేరు తేవాలి

ప్రజాశక్తి - పాలకొండ

కబడ్డీ పోటీల్లో జిల్లాకు పేరు రావాలనే ఉద్దేశంతో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయ్యేందుకే ఆదివారం నుంచి పది రోజుల పాటు సిఎం నాయుడు కళ్యాణ మండపం ఆవరణలో శిక్షణ ఇస్తున్నట్లు మన్యం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వెన్నపు చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం నక్కలపేటలో బాబా మందిరం దగ్గరలో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులతో కలిసి విలేకరులతో సమావేశమయ్యారు. అండర్-18 ఎంపిక ఈనెల 24న జరుగుతుందన్నారు. 22 మందికి కోచింగ్ ఇస్తున్నప్పటికీ 14 మందిని ఎంపిక చేశామన్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కొండలరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు అవసరమన్నారు. ఆరోగ్యంతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ ఏడాది రాష్ట్ర స్థాయిలో కబడ్డీ పోటీలు ఇక్కడే నిర్వహించే ఆలోచన చేస్తున్నామన్నారు. సమావేశంలో కోశాధికారి గార లక్ష్మణరావు, కోచ్ సితేంద్ర కుమార్, జిల్లా వ్యాయామ సంఘం అధ్యక్షులు రామకృష్ణ, జిల్లా రిఫరీ బోర్డు ఛైర్మన్ కాయల రమేష్ ఉన్నారు.

చిట్టిపూడివలసలో యోగాంధ్ర

వీరఘట్టం : మండలంలోని చిట్టిపూడివలసలో ఆదివారం యోగాదినోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం సెలవు అయినప్పటికీ నడుకూరు పాఠశాల ఉపాధ్యాయుడు సాకేటి రాంబాబు ఆధ్వర్యాన యోగా నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణను శుభ్రం చేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం (బెలగాం) రైల్వే స్టేషన్ వద్ద ఈనెల 8న గుర్తు తెలియని వ్యక్తి గాయపడినట్లు స్టేషన్ మాస్టర్ పి. శ్రీనివాసరావు ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆ వ్యక్తిని అదే రోజు స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియలేదు. మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆసుపత్రి మార్చ్యురీలో భద్రపరిచారు. పార్వతీపురం రైల్వే హెచ్సీ రత్నకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.